క్లుప్తంగా

ప్రభుత్వ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

నిడదవోలు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయాల, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ పి.శామ్యూల్ ఆదేశించారు. సమిశ్ర గూడెం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 గ్రామ సచివాలయాల్లో పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిషత్, పంచాయతీల సాధారణ నిధులతో చేపట్టిన పనులు నాణ్యతతో చేపట్టేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పీఆర్ ఏఈ సీహెచ్ఎస్ఆర్కే శాస్త్రి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలులో ఆయుర్వేద వైద్య శిబిరం

నిడదవోలు: పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ప్రారంభించారు. రొటెరియన్ ఉప్పులూరి వీరభద్రరావు ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, డాక్టర్ శ్రీవిద్య, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీవానిస్, కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, కోశాధికారి కాళ్ల రాంబాబు, కొత్తపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారికి సన్మానం

నిడదవోలు రూరల్: తాడిమళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణానికి కృషి చేసిన వైద్యాధికారి జి.సుధీర్‌కుమార్‌ను శనివారం స్థానిక నాయకులు, ఆరోగ్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి వైద్యాధికారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బయ్యే రాధారాణి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాపకాయల సూర్యనారాయణ, ఎంపీహెచ్ఓ రామకృష్ణ, పీహెచ్ఎన్ ఎమేలమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్ఎఫ్‌లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి విరాళం

నిడదవోలు: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ నిడదవోలు శాఖ సర్వసభ్య సమావేశాన్ని శనివారం సంఘ అధ్యక్షుడు బలగం అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల ఆకస్మికంగా మరణించిన సంఘ సభ్యుడు దేవిశెట్టి వీరభద్రరావుకి సంతాపం తెలిపారు. పెన్షనర్ల నూతన భవన నిర్మాణానికి సంఘ సభ్యుడు పొన్నా కృష్ణబాబు రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా కృష్ణబాబుని సత్కరించారు. కీర్తి ఆంజనేయులు, కొండనిర్మల, శమంత కమణి, బొజ్జా పాపారావు, ఎలిపిన శేషగిరిరావు, హాజీ, ఖండవిల్లి రంగచార్యులు, విశ్వామిత్ర, సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి.. పింఛను అందించి..

తాళ్లపూడి: స్థానిక సచివాలయం పరిధిలో ఉంటున్న మల్లిపూడి సరస్వతి అనారోగ్యం కారణంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీర్ మాడుగుల పద్మ శనివారం ఆసుపత్రికి వెళ్లి ఆమెకు వికలాంగు పింఛను అందజేశారు.

ఓటర్ల జాబితా సవరణకు 304 దరఖాస్తులు



నల్లజర్లలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దారు కిశోర్‌కుమార్

నల్లజర్ల: ఓటర్ల జాబితా సవరణ-2023 కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి 304 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దారు కిశోర్‌కుమార్ తెలిపారు. మండలంలో నల్లజర్ల, అచ్చన్నపాలెం, అనంతపల్లిలో బూత్‌లను శనివారం ఆయన పరిశీలించారు. 165 మంది కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోగా, మరణించిన వారి, గ్రామాంతారాలకు వెళ్లిన వారు ఫారం-7 ద్వారా 42 మంది, ఫారం-8కు 97మంది దరఖాస్తు చేసుకున్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల ముసాయిదా ఓటర్ల జాబితా ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. బీఎల్వోలు కచ్చితంగా పోలింగ్ కేంద్రంలో ఉండాలని, కొత్త ఓటర్ల నమోదు, సవరణల దరఖాస్తులో అన్ని వివరాలు సక్రమంగా ఉన్నయో లేదో సరిచూసుకోవాలన్నారు. ఆయన వెంట ఎన్నికల మండల ఎలక్షన్ ఆపరేటర్ యోహాను ఉన్నారు.

చాగల్లులో 211 దరఖాస్తులు

చాగల్లు: ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో 211 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. ఫారం 6కు 98, ఫారం7కు 31, ఫారం 8కు 82 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. మండలంలో 50 పోలింగ్ కేంద్రాల్లోను బీఎల్వోలు దరఖాస్తులు స్వీకరించారన్నారు. ఆదివారం కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దేవరపల్లిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'



దేవరపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, జగనన్న సంక్షేమ పాలనకు ప్రజా మద్దతు కోరాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద మండల పార్టీ కన్వీనర్ కూచిపూడి సతీష్ అధ్యక్షతన నియోజకవర్గంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంపై ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీ నాయకులు చేస్తున్న గ్లోబల్ ప్రచారాన్ని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. చంద్రబాబు స్కామ్‌లు చేస్తే, జగనన్న స్కీమ్‌లు పెట్టి పేదలను ఆదుకొంటున్నారని ఆయన తెలిపారు. ప్రతి పేదవాడికి న్యాయం చేయడమే జగనన్న లక్ష్యమన్నారు. ఈ 9వ తేదీ నుంచి 40 రోజుల పాటు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరుగుతుందని, మండల కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, అధికారులు భాగస్వాములై ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నియోజవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా ఐకమత్యంతో పని చేసి రాబోవు ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను, ఎమ్మెల్యేగా తలారి వెంకట్రావును అత్యధిక మెజారీతో గెలిపించాలన్నారు. వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, నల్లజర్ల, గోపాలపురం మండలాల పార్టీ కన్వీనర్లు గగ్గర శ్రీనివాస్, పోతిరెడ్డి నాగరాజు, ద్వారకాతిరుమల మండల జెడ్పీటీసీ సభ్యులు సీహెచ్ సామ్యూలు మాట్లాడారు. కార్యక్రమంలో దేవరపల్లి, గోపాలపురం మండలాల జెడ్పీటీసీ సభ్యులు పొట్టి స్వర్ణలత, కాకులపాటి లలిత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కే వల్లీ, నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, కారుమంచి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు, పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే తలారి వెకంట్రావు
- రైతులకు మోటార్లు అందజేత



లబ్ధిదారులకు మోటార్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

దేవరపల్లి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తలారి వెకంట్రావు అన్నారు. దేవరపల్లి మండలంలో జలకళ పథకంలో బోర్లు వేసిన రైతులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఉచితంగా మోటారు, పంపు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గానికి జలకళ పథకంలో 206 బోర్లు ప్రభుత్వం ఉచితంగా వేసినట్టు ఆయన తెలిపారు. ఒక్కొక్క బోరుకు ప్రభుత్వం సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేస్తోందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో ద్వారకాతిరుమల మండలంలో 100 బోర్లు వేయగా, దేవరపల్లి మండలంలో 62 బోర్లు, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 38 బోర్లు వేసినట్టు ఆయన తెలిపారు. దేవరపల్లి మండలంలో ఆరు, నల్లజర్ల మండలంలో ఒకటి, గోపాలపురం మండలంలో ఒకటి చొప్పున మోటార్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. బోర్లు వద్ద విద్యుత్ ట్రాన్సఫార్మర్లు ఏర్పాటు చేసిన రైతులకు మోటార్లు అందజేసినట్టు ఆయన తెలిపారు. మిగిలిన రైతులకు కూడా త్వరలో మోటార్లు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ), ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీడీఓ బీడీఆర్ కృష్ణంరాజు, పార్టీ మడల కన్వీనర్ కూచిపూడి సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు సమర్థవంతంగా పనిచేయాలి



ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఈఆర్‌ఓ వెంకట సుధాకర్

గోపాలపురం: బూత్ లెవెల్ అధికారులు సమర్థవంతంగా పని చేయాలని ఓటు నమోదు, తొలగింపు ప్రక్రియపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల ఎగ్జిక్యూటివ్ రిటర్నింగ్ అధికారి కె.వెంకట సుధాకర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలోఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం బూత్ లెవెల్ అధికారులు పనిచేయాలన్నారు. వీఆర్వో కె.లక్ష్మి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలో ప్రత్యేక ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. మండలంలోని 67 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరించారు. పోలింగ్ కేంద్రాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటసుధాకర్, తహసీల్దార్ ఎం.రామకృష్ణ పరిశీలించారు. బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు.

కొవ్వూరు: కాపవరం గ్రామంలో ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఆర్డీవో ఎస్.మల్లిబాబు శనివారం పరిశీలించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే మా లక్ష్యం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- గోపవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష



గోపాలపురంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశ్యమని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని సగ్గొండ సచివాలయ పరిధిలోని గోపవరం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు అవసరమైన విద్య ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ లలిత, సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పోతిరెడ్డి నాగరాజు, ఎస్‌కే వల్లీ, కవిత, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా జ్యోతి రిలే నిర్వహించి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



కవాతు నిర్వహిస్తున్న క్రీడాకారులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- అంతర్ జిల్లాల బాలబాలికల అండర్ -19 కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

నిడదవోలు: విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్ క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 67వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల బాల, బాలికల అండర్ -19 కబడ్డీ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం క్రీడా జ్యోతి రిలే నిర్వహించి బాలుర, బాలికల కబడ్డీ కోర్టులను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులతో మాట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ సభలో శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలలో ప్రావీణ్యం కూడా ఎంతో అవసరమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి నింపడానికి ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసి వారికి క్రీడా సదుపాయాలు కల్పిస్తూ అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన బాల, బాలికలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, సింగవరం సొసైటీ అధ్యక్షుడు పెన్మన్స చందు, పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్లు దాకే అనిల్‌కుమార్, కొత్తపల్లి సుప్రియ, అహ్మదున్నీషాబేగం, రతీదేవి, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, పీఈటీలు వీరలక్ష్మీ, శాంతి, దుర్గ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులకు దూరంగా ఉంచండి



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సాబ్జి

ఉండ్రాజవరం: బోధనేతర పనులకు ఉపాధ్యాయులను దూరంగా ఉంచాలని ఉభయ గోదావరి జిల్లాల శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జీ కోరారు. ఉండ్రాజవరం శ్రీమతి బూరుగుపల్లి సత్యవతి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్-1లో మండల యూటీఎఫ్ విస్తృత కార్యవర్గ సమావేశం శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని యూటీఎఫ్ చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, జిల్లా సహాధ్యక్షులు ఐ.రాంబాబు, మండల అధ్యక్షులు కె.వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి దువ్వాపు రామారావు, జిల్లా కార్యదర్శి వి.రమణ, రాష్ట్ర కౌన్సిలర్ పి.రాముడు పాల్గొన్నారు. అనంతరం యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.లక్ష్మీనారాయణ, అధ్యక్షుడిగా కె.వెంకటరత్నం, సహ అధ్యక్షుడిగా ఎస్.తాతారెడ్డి, సహ అధ్యక్షురాలుగా ఎం.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బి.రామారావు, కోశాధికారిగా కె.రామకృష్ణ, కార్యదర్శులు ఎన్నుకున్నారు.

దేవరపల్లిలో ప్రభుత్వ కార్యాలయాల మంజూరు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గానికి కొత్తగా రెండు ప్రభుత్వ కార్యాలయాలు మంజూరు చేస్తూ రాష్ట్ర కేబినెట్ సమావేశం ఆమోదించినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ప్రాంతీయ రవాణాశాఖ అధికారి కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. రెండు కార్యాలయాలను దేవరపల్లిలోనే ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. గ్రామ శివారు రామన్నపాలెం వద్ద అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ నెలాఖరున శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. రెండు ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) కృతజ్ఞతలు తెలిపారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెరవలి: జిల్లాలో రెండో ద్వారకా తిరుమలగా పేరుగాంచిన అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులతో పోటెత్తింది. శనివారం వేల సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారిని పూలతోపాటు వంకాయలతో అలంకరించారు. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. అన్నసమారాధాన దాత బీమవరానికి చెందిన శెన్నంశెట్టి దుర్గాప్రసాద్, హనుప్రియ దంపతుల ఆర్థిక సాయం అందించారు. ఈ అన్నసమారాధనను పెరవలి ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. 5వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరం

తాళ్లపూడి: సమాజంలో లంచం ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరమని, వాటిని ప్రోత్సహించడం మంచిది కాదని వేగేశ్వరపురం పోస్టుమాస్టర్ ఏడుకొండలు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం డివిజన్ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన సూచన మేరకు అవినీతికి నో చెప్పండి దేశానికి కట్టుబడి ఉండండి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనితో పాటు తపాలాశాఖ వారు అందజేస్తున్న సేవింగ్ పథకాలు, బీమా పథకాల గురించి ఏడుకొండలు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎ.పోసియ్య, సిబ్బంది, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుమల గౌరీనాథ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

పెరవలి: గ్రామంలో భక్తిశ్రద్ధలతో పడిపూజ నిర్వహించారు. సలాది శ్రీహరి 18 సార్లు అయ్యప్ప మాల దరించడంతో ఆయన ఇంటి వద్ద శనివారం సాయంత్రం పడిపూజ చేశారు. అయ్యప్ప మండపాన్ని పూలతో అలంకరించారు. కేరళ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన డప్పులు వాయిద్యాలతో పెరవలి గ్రామం హోరెత్తింది. ఈ పడిపూజకు తణుకు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలలకు చెందిన అయ్యప్పలు వందలాది మంది పాల్గొని, భజనలు చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

నల్లజర్ల: బాధితులకు వైద్య ఖర్చులకు నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దేవరపల్లి క్యాంపు కార్యాలయంలో శనివారం వారికి అందజేశారు. దూబచెర్లకు చెందిన సయ్యద్ మస్తాన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.12లక్షలు, ఘంటావారిగూడెం ఎంపీటీసీ సభ్యురాలు యలమర్తి సూర్యకుమారి మోకీలు మార్పిడి శస్త్రచికిత్సకు రూ.65వేలు, అనంతపల్లికి చెందిన సయ్యద్ బేగంకు వైద్య ఖర్చుల కిందరూ.65వేలు, పురిగళ్ల లక్ష్మి ప్రసన్నకు వైద్యఖర్చుల నిమిత్తం రూ.25 వేల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గగ్గరశ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైస్ ఎంపీపీ అచ్యుతా శివాజీరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్, మండల కోఆప్షన్ మెంబరు సయ్యద్ మునాఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

గోపాలపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు గోపాలపురం ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక బైపాస్ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో సుమారు 20 ఐరన్ బారికేడ్లను ఏర్పాటు చేశారు. వాటికి రేడియం స్టిక్కర్లు అతికించడంతో రాత్రిళ్లు జరిగే ప్రమాదాలు కొంతైనా నివారించవచ్చని తెలిపారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు దేవరపల్లి సీఐ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాటిని ఏర్పాటు చేశామని ఎస్సై తెలిపారు. ఏఎస్సై కె.శోభనాద్రి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అన్నదేవరపేటలో మాదిగల మహాసభ

తాళ్లపూడి: అన్నదేవరపేటలో శనివారం మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహించారు. ఈ సభలో జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన సికింద్రాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మాదిగ ఉపకులాల సభ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మహాసభ జరగనుందని, ఈ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. కోస్తా ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త సుబ్బారావు మాదిగ, జిల్లా ఇన్‌చార్జి పూసపల్లి వెంకట్రావు, కొడమంచిలి జాన్ వెస్లీ, ఖండవల్లి వెంకటరాజు సిర్రా చంద్రరావు, ప్రత్తిపాటి రాజు, కొలూరి రాజకుమార్, ముప్పిడి దానియేలు, గెడ్డం అనిల్, గెల్లా నటరాజ్, కత్తి సోమరాజు, చిట్టిబాబు, బంటుపల్లి బాలు, నగేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చదరంగం, చిత్రలేఖనం పోటీలు

చాగల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం చదరంగం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పాన్సర్, రొటేరియన్ పిచ్చెట్టి ఫణిసింహ మాట్లాడుతూ చదరంగం, చిత్రలేఖనా పోటీలు విద్యార్థులలో ఆలోచన, సృజనాత్మక శక్తిని పెంపొందిస్తాయని తెలియజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పి.వీ రాజు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ ఆకుల రాజీవ్, ట్రెజరర్ తుమ్మెద సత్తిరాజు ప్రోగ్రాం చైర్ ఇంజె శేఖర్ పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

కొవ్వూరు: భర్త అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడడంతో ఈ నెల 28 తేదీన ఇందిరమ్మ కాలనీకి చెందిన మహిళ ముప్పిడి దివ్యకుమారి ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ కేసులో నిందుతుడైన మృతురాలి భర్త రవిబాబుని శనివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు.

మినీ వ్యాన్ బోల్తా

నల్లజర్ల: ఏలూరు నుంచి కొవ్వూరు మినీ వాహనంపై తీసుకెళ్లుతున్న జనరేటర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఏఎస్ఐ మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం.. బోరింక ప్రవీణ్ మినీ వాహనంపై జనరేటర్‌ను తీసుకొని వెళ్తుండగా పుల్లలపాడు వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్న ట్రాక్టరును తప్పించబోయి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రవీణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. వ్యాన్ రోడ్డుపై బోల్తా పడడంతో ట్రాఫిక్ నిలచిపోయింది. ఏఎస్సై మోహన్‌రావు ట్రాఫిక్ పునరుద్ధరించారు.

45 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

గోపాలపురం: సారా బట్టీలపై దాడి చేసి 45 లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ డి.సుధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరగపాడు పంచాయతీ పరిధిలోని బుచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన చిక్కాల శ్రీనివాసరావు కొవ్వాడ రిజర్వాయర్ ప్రాంతంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన సారా బట్టీలపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో 45 లీటర్ల సారా, 900 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, శ్రీనివాసరావును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ సుధ తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎంపీపీ పోశిరాజు
- తాళ్లపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



తాళ్లపూడి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు

తాళ్లపూడి: నిధులు మంజూరైన గ్రామాల్లో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని మండల పరిషత్ అధ్యక్షుడు జొన్నకూటి పోసిరాజు అన్నారు. తాళ్లపూడి మండ పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో వెంకట రమణ సమావేశాన్ని కొనసాగించారు. ఎంపీపీ పోశిరాజు ఆయా శాఖల పనితీరుపై అధికారులతో రివ్యూ నిర్వహించారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్యుత్, హౌసింగ్, రెవెన్యూ, ఐసీడీఎస్, ఉపాధి హామీ పథకం, పారిశుధ్య నిర్వహణ, ఆరోగ్య శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న పనితీరు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏవో జి.రుచిత మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. 17 శాతం లోపే తేమ శాతం ఉండాలన్నారు. వైద్యాధికారి దుర్గాభవాని మాట్లాడుతూ మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పూర్తయ్యాయని, 6400 మందికి పరీక్షలు చేసినట్టు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ వెంకటరావు మాట్లాడుతూ జగనన్న లేవుట్లలో విద్యుత్ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. హౌసింగ్ ఏఈ సుబ్బరాజు మండలంలో మొత్తం 2131 గృహాలు లేవుట్లలో మంజూరయ్యాయని, అందులో 1092 గృహాలు పనులు ఇంకా మొదలు కాలేదని మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అదేవిదంగా సొంత స్థలంలో 863 గృహాలు మంజూరు అయ్యాయని 306 పనులు మొదలు పెట్టలేదని మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిపాదనలు లేకుండా సర్పంచులు చెప్పిన చోట పనులు చేయడం కదరదు అని చెప్పడంతో ఎంపీపీ అభ్యంతరం తెలిపారు. దీనిపై సమాధానం సక్రమంగా చెప్పాలన్నారు. అదేవిదంగా ఎంఈవో సీహెచ్ నెహ్రూజీ, సీడీపీవో మమ్మి, ఎక్సైజ్ ఎస్ఐ సత్యనారాయణ తదితరులు తమ శాఖల పనితీరు వివరించారు. గజ్జరం ఎంపీటీసీ సభ్యుడు గుంటు చిన్నబ్బాయి గ్రామాల్లో సారా అమ్మకాలు లేకుండా చూడాలన్నారు. అధికారులు దీనిపై చర్యలు చేపట్టాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధికారులు చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు మాట్లాడుతూ మండలంలో జగనన్న సురక్ష పథకం విజయవంత చేశామన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఎన్నికలకు ఎంతో సమయం లేనందున్న గ్రామాల్లో ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వీరన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, పెద్దేవం ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, మండల అధికారులు, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.